కేంద్రాలు సరే.. సంపద ఎక్కడ.?

- అలంకారప్రాయంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- నిర్వహణను గాలికొదిలేసిన పంచాయతీ సిబ్బంది
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త


తాండవ నదిలో వేసిన పాయకరావుపేటకు చెందిన చెత్త


చెత్తను కాల్చివేస్తున్న దృశ్యం


ఆవ గర్భంలో వేసిన మంగవరానికి చెందిన చెత్త

పాయకరావుపేట : రూ.కోట్లు ఖర్చు చేసి ప్రతి పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. పలు చోట్ల అరకొర సంపదకే పరిమితమవుతున్నాయి. దీంతో పల్లెల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ కేంద్రాలు అక్కరకు రాకపోవడంతో ఊరి చివరన చెత్తను పోగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పాయకరావుపేట మండలంలోని 24 పంచాయతీలకు గాను 14 గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. షెడ్లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. ఈ చెత్తను వేర్వేరు తొట్టెల్లో వేసి 48 రోజుల పాటు నిల్వ చేయాలి. అనంతరం అందులో వానపాములను విడిచిపెట్టి మరో 48 రోజులు నిల్వ ఉంచితే వర్మీకంపోస్టు (ఎరువు) తయారవుతుంది. ఈ ఎరువును కేజీల ప్రకారం అవసరమైన రైతులకు విక్రయించాలి. ఇలా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలన్న ప్రణాళికతో ప్రభుత్వం తలపెట్టింది. కానీ ప్రణాళిక ప్రకారం ఎక్కడా జరగడం లేదు. పంచాయతీ సిబ్బంది ఈ కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా మారాయి. పైగా గ్రామాల్లో చెత్తను కూడా సక్రమంగా సేకరించడం లేదు. సంపద కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ కుండీలు శిథిల స్థితికి చేరాయి.


అభివృద్ధికి నోచుకోని గోపాలపట్నం సంపద కేంద్రం

ఎక్కడికక్కడ డంపింగ్

చెత్తను పంచాయతీ సిబ్బంది గ్రామంలో రోడ్ల పక్కన, శివార్లలో, కాలువల్లో, సాగునీటి చెరువుల్లో వేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా సంపద రాలేదు సరికదా.. చెత్తను సాగునీటి చెరువులు, కాలువల్లో వేయడంతో ఆయా గర్భాలు కుచించుకుపోయాయి. దీంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని గోపాలపట్నం, పెంటకోట, కేశవరం, పాల్తేరు, సత్యవరం, పాయకరావుపేట, రాజవరం తదితర గ్రామాల్లోని సంపద కేంద్రాలు చెత్తను నిల్వ చేయడానికి కూడా పనికి రాకుండా ఉన్నాయి. గ్రామాల్లో చెత్తను సంపద కేంద్రాలకు తరలించి, ఎక్కువగా చెత్త ఉంటే కాపులుప్పాడకు తరలించాలని అధికారులు ఆదేశాలు ఉన్నాయి. కానీ ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది తాండవ నదిలోను, గోపాలపట్నం వద్ద ఆవ, సత్యవరం వద్ద తాండవ నదిలోను, కాలువల్లో వేస్తున్నారు. శ్రీరాంపురం గ్రామానికి చెందిన చెత్తను సమీపాన పాఠశాలల వద్ద, అరట్లకోటలో రోడ్ల పైనే డంప్ చేస్తున్నారు. దీంతో గ్రామాల్లోని రోడ్లు, నదులు, కాలువలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను కాలువలు, నదులు, రోడ్లపై వేయకుండా సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

నది, కాలువల్లో చెత్త వేయకుండా చర్యలు



సంపద కేంద్రాల అభివృద్ధిపై పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. నదులు, కాలువల్లో చెత్తను తీసివేయడానికి ప్రభుత్వం అంచనా తయారు చేయమంది. త్వరలో చెత్తను తొలగిస్తాం. తాండవ నది, ఆవ కాలువల్లో చెత్తను వేయకుండా చర్యలు తీసుకుంటాం. నోటీసులు జారీ చేస్తాం.

– ఎ.జయప్రకాష్‌రావు, ఎంపీడీవో, పాయకరావుపేట

శాకంబరిగా దుర్గాదేవి


వివిధ కూరగాయల అలంకరణలో దుర్గాదేవి

యలమంచిలి రూరల్: మండలంలోని పద్మనాభరాజుపేట దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా రైతులు, భక్తులు, మహిళలు తీసుకొచ్చిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శాకంబరీ నమోస్తుతే అంటూ భక్తులు జగన్మాతను దర్శించుకున్నారు. కొందరు మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఉచితంగా ప్రసాద వితరణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హరిభజన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మొగ్గ బుజ్జి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, జెర్రిపాతుల నానాజీ, రాయవరపు వెంకటేష్, మొల్లి అప్పారావు, ఎడ్ల శ్రీనుబాబు, కలిగట్ల నానాజీ, కొలగాని బాబూరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు 33 /11 కేవీలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. కొరుప్రోలు సబ్‌స్టేషన్ కోనవానిపాలెం ఫీడర్‌లో కోనవానిపాలెం, సారిపల్లిపాలెం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు, పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్‌లో పెదగుమ్ములూరు ఫీడర్‌లో పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు చినగుమ్ములూరు ఫీడర్‌పై పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నక్కపల్లి మండలం పెద్దబోదిగల్లం, రామకృష్ణాపురం, పెదదొడ్డిగల్లు, సీతమ్మపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు, తీగల మరమ్మతులు చేపడతామన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ ఎంపీడీవోకు అభినందనలు


డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యదర్శులు

నక్కపల్లి: డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులైన చలపతిరావును శుక్రవారం మండలంలో వివిధ గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతిపై ఆనందపురం నుంచి నక్కపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా చలపతిరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు కార్యదర్శులంతా ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పరిపాలనా విషయాల్లో సమష్టిగా పని చేద్దామని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఓవర్ హెడ్ ట్యాంకుల్లోను, వీధులు, మురికి కాలువల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. త్వరలోనే అన్ని పంచాయతీల్లో పర్యటిస్తానన్నారు.

చందనాడ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సీతారామరాజు


నక్కపల్లి: మండలంలో చందనాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సీతారామరాజు శుక్రవారం తనిఖీ చేశారు. హాజరు పట్టి పరిశీలించారు. కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారంతో పాటు నిల్వలను పరిశీలించారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందజేశారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు


మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు చేపడుతున్న దృశ్యం

మునగపాక: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఈఈ రామకృష్ణ తెలిపారు. మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలోని గృహాలు, వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లో–ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యుత్ సమస్యలుంటే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సురేష్, ఏఈ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక మండల అభివృద్ధికి కృషి


తహసీల్దార్ సత్యనారాయణను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

మునగపాక: అందరి సహకారంతో మునగపాక మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తహసీల్దార్ పి.సత్యనారాయణ అన్నారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను శుక్రవారం బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మునగపాక మండల సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. పార్టీ నాయకులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మళ్ల కాలేశ్వరరావు, దొడ్డి వెంకట సత్యనారాయణ, మళ్ల మల్లయ్యనాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్ములాటలతో కాలయాపన

- ప్రజలకిచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ధర్మశ్రీ మండిపాటు


మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు కుమ్ములాటలతో కాలయాపన చేస్తున్నారే తప్ప నియోజకవర్గంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను గాలికొదిలేశారని యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆరోపించారు. శుక్రవారం రాంబిల్లి మండలం మామిడివాడలో తన నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉమ్మడి రాష్ట్రంలో కానీ, విభజిత ఏపీలో కానీ పారిశ్రామికీకరణ, సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. వారి ముందుచూపుతోనే ఈ రోజు యలమంచిలి నియోజకవర్గం పారిశ్రామికంగా ఇంత అభివృద్ధి చెందడానికి కారణమన్నారు. ప్రస్తుతం వేలాదిమంది స్థానికులు అచ్యుతాపురం పారిశ్రామికవాడ, ఇతర పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు తప్పనిసరిగా ఇవ్వాలని అసెంబ్లీలో చట్టం చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో విస్తరించి ఉన్న సెజ్‌లో కాలుష్య నివారణ కోసం వదిలిన 10 శాతం గ్రీన్ బెల్ట్ ఏరియాలో భూ నిర్వాసితుల పునరావాసం కోసం ఇంటి స్థలాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, దీనివలన అక్కడ ప్రజలు కాలుష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజల జీవితాలు, ఆరోగ్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాబోయే 20 ఏళ్ల ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా అచ్యుతాపురం, పరవాడ ఫార్మాసిటీలను కలుపుతూ ఆరు లేన్ల రహదారిని నిర్మించాలని ప్రతిపాదించామని, కూటమి ప్రభుత్వం ఆ ప్రతిపాదనను పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలని కోరారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం


గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలో తలపెట్టిన గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం గాజువాక వుడా కాలనీకి చెందిన పి.వెంకటరామరాజు, కమలమ్మ దంపతులతో పాటు వారి బంధువైన కె.బుచ్చిరాజు కలిసి ఆలయ నిర్మాణానికి రూ.7,300 నగదు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు


అమలాపురంలో క్లోరినేషన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకోవడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు పడాల్సిన సమయంలో మండు టెండలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. రక్షిత మంచినీటి పథకాలు, బావులు, వీధులు, కాలువల్లో క్లోరినేషన్ పనులు ప్రారంభించారు. రక్షిత మంచినీటి పథకాల్లో బ్లీచింగ్ కలిపి నీటిని శుభ్రం చేయిస్తున్నారు. కాలువలు, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను, మురుగును తొలగిస్తున్నారు. చందనాడ, అమలాపురం, పాటిమీద, మూలపర, బోయపాడు తదితర గ్రామాల్లో క్లోరినేషన్ పనులను ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. సచివాలయాల్లో ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులతో ఎవరైన ఇబ్బంది పడితే ప్రాథమిక చికిత్స అందించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు.

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయండి


కోటవురట్లలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కోటవురట్ల: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా ఈసారి ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్‌తో చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాలు, కరపత్రాలు, డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రజలను చైతన్యపరచాలన్నారు. దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించకుండా పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. క్లాత్ బ్యాగ్స్, గ్లాస్ బాటిళ్లు వినియోగించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ పనులు కల్పించాలి


తమ్మయ్యపేటలో మస్తర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన తమ్మయ్యపేటలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పనులకు హాజరైన వారికి మాత్రమే మస్తరు వేయాలన్నారు. రాని వారి పేరున మస్తర్లు వేయడం బినామీలను పనులకు పిలవడం వంటి చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేతనం రూ.307 గిట్టుబాటు అయ్యేలా పనులు కేటాయించాలని, ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పనులు ఎంపిక చేయాలన్నారు. పనులు జరిగే చోట తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. స్థానికంగా కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు.

యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి


నాగులాపల్లి నాయకులను నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీకి పరిచయం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మండలంలోని నాగులాపల్లికి చెందిన పార్టీ నాయకులను శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి అన్నీ మంచి రోజులేనన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మళ్ల ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్, పార్టీ నేతలు బొడ్డేడ బుజ్జి, మళ్ల భాస్కరరావు, దొడ్డి నాగమోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన మోసాలమయం

- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు
- ఎస్.రాయవరం మండల కార్యకర్తలతో విస్తృత సమావేశం


క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నాయకులు


సమావేశానికి హాజరైన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు

ఎస్.రాయవరం: చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా మోసాలే ఉంటాయని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డులో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన శుక్రవారం ఎస్.రాయవరం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై కార్యకర్తలతో చర్చించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. ఎన్నికల్లో వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలకు మించి సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ హోంమంత్రి పదవిలో ఉన్న అనిత తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రానికి సీఎంగా చేసిన వ్యక్తి, పార్టీ అధ్యక్షులు ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తున్న అనిత ఎవరి మెప్పు పొందాలనుకుంటుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. అడ్డురోడ్డు–కోటవురట్ల రోడ్డు గోతులతో నిండి చెరువును తలపిస్తుందని, అయినా మంత్రి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారని కంబాల చెప్పారు. చంద్రబాబు మాట ఇస్తే మోసం చేస్తాడు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే అమలు చేసే వరకు నిద్రపోడని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ, పార్టీ మహిళా విభాగం జనరల్ కార్యదర్శి కాకర దేవి, జిల్లా జనరల్ కార్యదర్శి మధువర్మ, జిల్లా కమిటీ మెంబర్ యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కనికళ్ల అమ్మాజీ, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, మైలపల్లి శ్రీనివాసరావు, శానాపతి శ్రీరాములు, గాడి అప్పలనరసింహం, మల్లే లోవరాజు, నాయకులు వెదుళ్ల బంగారి, ఉద్దండం సూర్యనారాయణ, చోడిపల్లి కోదండ, చేకూరి రామచంద్రరాజు, మైలపల్లి రాజారావు, దాట్ల రాముడు, బొండా దివాణం, వియ్యపు సింహాద్రి, వెలగా శ్రీనివారావు, వైబోయిన సత్తిబాబు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్


రహదారికి రెండు వైపులా బారులు తీరిన వాహనాలు


ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం కూడలిలో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ప్రత్యామ్నాయం చూపకుండా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఎప్పుడు ఏ దారి మూత పడుతుందో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ వందలాది వాహనాలు అచ్యుతాపురం కేంద్రంగా రాకపోకలు సాగించడం.. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం నిత్యకృత్యంగా మారింది. శుక్రవారం ఒకవైపు సంత హడావుడి.. మరోవైపు పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు రాకపోకలతో అచ్యుతాపురం కూడలిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో
మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 18/2024 O.S. 930/2017

VI వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, విశాఖపట్నం

Between:
పీలా రామకృష్ణారావు ..... DHR
And:
కంఠంరెడ్డి సత్యవతి ..... JDR

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో J.Dr కు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారు కోర్టులో **తేది: 05-08-2025 ఉదయం 10.30 గం॥** నుండి ఈ క్రింది షెడ్యూలు ఆస్తులను శ్రీ కోర్టువారు వేలం షరతులకు లోబడి వేలం వేయుదురు. కావున వేలంలో పాల్గొనదలచినవారు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలంలో పాల్గొనవలసినదిగా ఇందుమూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడం అయినది.

వేలం షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, యలమంచిలి సబ్ రి॥, అచ్యుతాపురం మండలం, సోమవారం గ్రామం (పూర్తి విస్తీర్ణం య. 1.41 ట్లు భూమి వివరాలు:

Item 1: సర్వే నెంబరు 12/1B నందు య. 0.15 సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు:** పంచదార్ల తాతలు భూమి, **పడమర:** అనాల దురగాలమ్మ భూమి, **దక్షిణం:** చొప్పా దేముడు భూమి, **ఉత్తరం:** నర్మాల సోములు భూమి.

Item 2: సర్వే నెంబరు 19 నందు య. 0.31 సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు:** కంఠంరెడ్డి పెద దేముడు భూమి, **పడమర:** కంఠంరెడ్డి సూకరాజు భూమి, **దక్షిణం:** ప్రభుత్వ భూమి, **ఉత్తరం:** M.P. లింగారెడ్డి రియల్ ఎస్టేట్ భూమి.

Item 3: సర్వే నెంబరు 31 నందు య. 0.45సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు:** కోరుపోలు తాతలు భూమి, **పడమర:** కంఠంరెడ్డి ముసిలినాయుడు భూమి, **దక్షిణం:** కేత ఉషారాణి భూమి, **ఉత్తరం:** కంఠంరెడ్డి నరసింహమూర్తి భూమి.

Item 4: సర్వే నెంబరు 99/1 నందు య. 0.50 సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు:** కోరుపోలు సరోజారావు భూమి, **పడమర:** కొల్లి తాతారావు భూమి, **దక్షిణం:** దొప్పలపూడి కృష్ణారావు భూమి, **ఉత్తరం:** గంపల విజయకుమార్ భూమి.

DHR విలువ: Rs. 20,00,000/-
Amin విలువ: Rs. 14,10,000/-

A.N. Murali Krishna
Srinivasa Patnaik
Advocates
Yellamanchili

యలమంచిలి
తేది: 15-07-2025